వ్యాస కౌముది

# భళా..కొత్తపాళీ..!

కర్లపాలెం హనుమంత రావు

సెప్టెంబరు 19 తాపీ ధర్మారావుగారి జయంతి. ఆ భాషాసేవకుడి పేరు మీద 'తెలుగు మాధ్యమాల దినోత్సవం' జరుపుకోవడం మన ఆనవాయితీ. సందర్భోచితంగా కూడా ఉంటుంది.. కాబట్టే నాకు తెలిసిన నాలుగు ముచ్చట్లు తాతాజీని గురించి!

ఏటుకూరి ప్రసాద్ వంటి ఉద్దండులు ఎట్లాగూ తాపీ ధర్మారావు జీవితం-రచనలు మీద ఏకంగా ఒక సిద్ధాంత గ్రంథమే వెలువరించారు. ఆ పరిశోధనాపత్రం నుంచి 'తాపీ ధర్మారావు నాయుడు తెలుగు రచయిత, తెలుగు భాషా పండితుడు, హేతువాది, నాస్తికుడు. 'ఆంధ్రులకొక మనవి' వంటి సంచలనాత్మక అంశాలతో పలు పొత్తాలు, వివిధ సాహిత్యాంశాలపై సాహిత్య మోర్మోరాలు రచించారు' అంటూ కట్టె, కొట్టె, తెచ్చె రీతిలో మూడు ముక్కల్లో చెప్పి ముగించేయచ్చు. నిజానికి 'రాముడికి సీత ఏమవుతుంది?' అన్న తెలుగువాడి చిన్న నుడికారాన్ని యమ సీరియస్సుగా తీసుకొని ఓ థీసిస్సే వెలువరించిన తాపీవారిని గురించి రామాయణమంత రాయాలి. సమయాభావం.. స్థలాభావం సమస్యలు!

తాపీవారి జీవిత చరిత్రను ఏకరువు పెట్టడమో. ఆ కవిపండితుడి రచనల్లోని విశేషాలను అప్పచెప్పడమో కాకుండా.. తెలుగు భాష మీద దశాబ్దాల కిందట నాయుడుగారు వెలువరించిన కొన్ని అభిప్రాయాలూ క్లుప్తంగా వివరించడం ఈ చిరువ్యాసం ప్రధాన ఉద్దేశం. వీసమెత్తు మార్పైనా లేకుండా ఇన్ని దశాబ్దాలు బట్టీ అప్పటి దురదృష్టకర పరిస్థితులే మరో రూపంలో ఎట్లా కొనసాగుతున్నాయో అప్పుడు గానీ కొత్త తరం అవగాహనలోకి రాదని భావన. తాతాజీ జయంతి సందర్భాన్ని పురస్కరించుకొని అయినా మనలో ఏ కొద్దిమంది బుద్ధిమంతులలో ఎంతో కొంత పునరాలోచన కలిగితే ఈ రచన లక్ష్యం నెరవేరినట్లే.

కొత్త పాళీలోని వ్యాసాలు ఓం ప్రథమంగా 1936 సంవత్సరం ప్రజామిత్ర వారపత్రిక సంక్రాంతి పండుగ సంచిక నుంచి ప్రారంభమయాయి. కొన్ని వారాలపాటు నాటి పాఠకులను ఉర్రూతలూగిస్తూనే నివ్వెరపాటుకు గురిచేసాయి. నివ్వెరపాటుకు గురిచేస్తూనే పునరాలోచనలో పడవేశాయి. 1955 నుంచి 1995లోగా ఆరుసార్లు ముద్రణకు వెళ్లిందీ కొత్తపాళీ వ్యాసావళి, నాలుగు దశాబ్దాలు దాటినా పాఠకుల మీద తాపీవారి ప్రభావం ఏ మాత్రం తగ్గలేదనడానికి ఇదో శుభ సూచన.

తాతాజీ అంటే ఈ తరానికి ఏ మేరకు తెలుసో తెలీదు. పూర్వాశ్రమంలో వీరగ్రాంధికవాది ఆ కవిపండితుడు. అయినా కాలానుగుణంగా వచ్చిన మార్పులను సద్భావనతో స్వీకరించి తదనంతర కాలంలో అంతే గాఢంగా వ్యవహారిక భాషావాదాన్ని నెత్తికెత్తుకొన్న గొప్ప పరిణామ చైతన్యశీలి తాపీ. ఈ కాలం కుర్రకారు సైతం ఊహించేందుకు ఇష్టపడని ఎన్నో క్లిష్టమైన అంశాలను ధర్మారావు దాదాపు ఎనభై ఏళ్ల కిందటే అక్షరాలా పుస్తరీకరించారు. పెళ్ళి- దాని పుట్టుపూర్వోత్తరాలు, దేవాలయాలపై బూతు బొమ్మలెందుకు? వంటి సంచలనాత్మకమైన అంశాలను ఎన్నుకొని మరీ పరిశోధన సాగించే సాహసం ఈ ఆధునిక యుగంలో ఎంత మంది అధునాతులకుంటుందో సందేహమే!

అహేతుకమైన ఆలోచనలను మూర్ఖంగా అనుసరించే సజ్జు మానవ సమాజంలో అన్ని కాలాలలోనూ సహజంగానే అత్యధిక సంఖ్యలో కనిపిస్తుంది. తాపీవారి 'ఇనుపకచ్చడాలు' వంటి ఇనుప గుగ్గిళ్లు ఆ తరహా మూఢ విశ్వాసులను ఏనాడూ తాపీగా నిదుర పోనిచ్చింది లేదు. ధర్మారావుగారి 'రాముడికి సీత ఏమవుతుంది?' ఇప్పుడు గానీ విడుదలయితే ఆ గొప్ప వాస్తవవాది ఎన్ని తిప్పలపాలయ్యేవారో! ప్రముఖ హేతువాది ఎం.ఎన్.రాయ్,

ప్రఖ్యాత నాస్తికకవి త్రిపురనేని పుట్టిన 1887లోనే తాపీవారి జన్మదినం కూడా. నమ్మిన విశ్వాసజానకి హేతువనే అగ్నిపరీక్షకు నిలబడి గెలిచినప్పుడు రాంబంటు మాదిరి ఆ భావజాలాన్ని భుజానేసుకు ఊరేగే సామాజిక ఆంజనేయుల్లు సమాజరామాయణంలో ఎప్పుడూ కనసిస్తారు. తాపీ ధర్మారావుదీ ఆ అకలంక భాషాభిరాముని సేవకజాతే. 'రాలూ రప్పలూ'రచన తాపీవారి జీవిత చరిత్ర ఒకరకంగా. అర్థవంతమైన జీవితం ఎట్లా కొనసాగించవచ్చో తాపీవారు తన జీవితాన్నే ఓ సందేశంగా మార్చి ప్రదర్శించారు ఆ చిన్నిపొత్తంలో.

నిప్పులు కురిసే బండారువారి భావధారలో కేవలం అత్యాధునికమైన ఆలోచనా పార్శ్వమే కాదు.. అత్యంత ప్రాచీన సాహిత్యం పైనా కొత్త తరహా చూపు విస్పష్టంగా కనిపిస్తుంది. 'కొత్త పాళీ' చేపట్టక ముందు చేమకూర 'విజయవిలాస' వ్యాఖ్యాతది 'పాత పాళీ'నే! 'విజయ విలాసం' ప్రబంధానికి తనదైన శైలిలో 'హృదయోల్లాస వ్యాఖ్య' రాసి 1971లో కేంద్రసాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్న ప్రజ్ఞాశాలి తాతాజీ. అంతకు నాలుగున్నర దశాబ్దాలకు ముందు 1926లో శ్రీ శృంగేరి పీఠాధిపతులువారి చేతుల మీదుగా 'ఆంధ్రవిశారద' బిరుదూ ధర్మారావు అందుకున్నారు. బిరుదులు, సత్కారాలు, సన్మానాలు ప్రతిభావంతులైన కవులకు సాహిత్య ప్రస్థానంలో అత్యంత సహజం. కానీ ప్రజాబాహుళ్యం మాట కోసం నిత్యం సమరం సాగిస్తూనే పండితుల నోటా 'శహబాషు'లు రాబట్టుకోవడం మాత్రం మాటలు కాదు. ఆ తరహా అరుదైన ఉద్దండుల దండులో తాపీవారిది పెద్దపీట. 'ఆలిండియా అడుక్కుతినేవాళ్ళ మహాసభ' నుంచి 'భిక్షాపాత్రము' దాకా విస్తృతమైన వైవిధ్యం తాపీవారి రచనాంశాలలో విశదమవుతుంది. ధర్మారావుగారి 'ఆంధ్రులకొక మనవి' పత్రం పరిశీలిస్తే కవికి సమాజం పట్ల ఉండదగ్గ బాధ్యతలేమిటో తెలిసివస్తాయి. తాతాజీ హేతువాదిగా మారినప్పటి బట్టి సృజించిన సాహిత్యం మొత్తం సాధ్యమయినంత మేర ప్రతీ సాహిత్యాభిమాని తప్పక సేకరించి పఠించి పదికాలాల పాటు పదిలంగా దాచుకుని మననం చేసుకోదగ్గ ప్రజ్ఞానిధి.

రైల్వేవారు టైం టేబులు కూడా గ్రాంధికంలో తప్ప వెలయించలేని రోజులు కొన్ని దశాబ్దాల కిందట ఉండేవి. విశ్వవిద్యాలయాల వారికి భాషంటే గ్రాంధికమే అప్పట్లో. సంస్కృత సమాసభూయిష్టంగా లేని పక్షంలో నైపుణ్యంతో నిమిత్తం లేకుండా విద్యార్థి పరీక్షాపత్రాన్ని పక్కన పెట్టేయడం అప్పటి అకడమీషియన్స్ 'స్టైల్'. పొట్టకూటికి కొరగాని ఈ కొరుకుడు పడని గ్రాంధికం వల్ల సామాన్యజనానికి ఒరిగే ప్రయోజనం ఏమిటని తాపీవారు విసుగూ విరామం లేకుండా ప్రశ్నిస్తుండేవారు.

సాహిత్యం– సమాజం, సంస్కృతుల ముందు నిలువుటద్దంగా నిలబడి ఉండాలని అని గట్టిగా నమ్మే భాషావేత్త– గిడుగు రామ్మూర్తి. ఆ పంతులుగారు 'బాలకవి శరణ్యం' పేరున నిత్యవ్యవహారికి అక్కరకొచ్చే భాషావైశిష్ట్యాన్ని గురించి చేసుకున్న మొత్తుకోళ్లన్నీ పండితలోకం కేవలం ఒక భాషాఖండనగా జమకట్టి పక్కన పెట్టింది. అప్పటి గ్రాంధిక భాషకు గట్టి సమర్థకులు, సమర్థులు జయంతి రామయ్యపంతులుగారు. ఆయనకు వత్తాసులు ఆంధ్ర సాహిత్య పరిషత్తు సభ్యులు. గిడుగువారు వారితో విభేదిస్తూ అవిరామంగా చేసిన భాషాయుద్ధాలు అన్నీ ఇన్నీ కావు. ఈ పరిణామ క్రమాన్నంతా కళ్లారా గమనించారు తాపీ ధర్మారావు. మనసు పెట్టి ఆలోచించారు. తన పూర్వ పంథా అయిన గ్రాంధిక భాషాభిమానాన్ని ఒక్క ఉదుటున వదిలించుకొన్నారు. ఏమాత్రం సంకోచం లేకుండా వ్యావహారికా భాషావైభవాన్ని పదిమంది ముందు సగర్వంగా నిలబెట్టేందుకు బలమైన కొత్తపాళీతో తనదైన యుద్ధం ప్రారంభించారు. నిజాలు నిర్భయంగా సహేతుకమైన రుజువులతో వాడుకభాషలో వెలిబుచ్చే ప్రజాసాహిత్యానికి తాపీవారి వాచ్యమే నాందీ వచనం.

ధర్మారావుగారి గ్రాంధిక శైలి వ్యతిరేకతను సంస్కృతజ్ఞానలేమిగా ఎద్దేవా చేసిన పండితులూ కద్దు. ఇవేవీ ఆ పోరాటయోధుని ఆత్మస్థైర్యాన్ని సడలనిచ్చిందిలేదు. సరికదా సామాజికుల తెలుగు కోసం తాను ఎందుకు వెంపర్లాడలవలసి వచ్చిందో కలసివచ్చిన ప్రతీ సందర్భంలోనూ ఢంకా బజాయించి మరీ వివరణలు ఇచ్చుకున్నారు. తాపీవారి పోరాట ఫలితమే పండిత సభలలో సైతం వ్యావహారికానికి మహరాజయోగం పట్టడం!

'సంస్కృతం ఎంత విజ్ఞానభూయిష్టమైనా వాడుకలోలేని ఆ వేడుక వాఙ్మయం సాహిత్యభాష మిషతో వాడవాడలా రాసులుగా పోసేయడం వల్ల బడుగుల బతుకులకు రెండు మెతుకులైనా అదనంగా దొరకవు! తల్లిభాషే సక్రమంగా నోట పలకని పిల్లవాండ్రకు, పాటకజనాలకు దైవభాషతో వనగూడే ప్రత్యేక ప్రయోజనాలు సున్నా. మహా మహోపాధ్యాయులమంటూ భుజకీర్తులు తగిలించుకు మరీ అక్షర బజారుల వెంట ఊరేగే పండితమ్మన్యుల వాచ్యాలు, వాక్యాలలోనే గట్టిగా తైర్పారపడితే తట్టలకొద్దీ లొసుగులు బైటపడక తప్పవు. దేవతల భాష అన్న మోజుతో పాఠశాలల్లో ఏ నాలుగైదు తరగతుల వరకో విద్యార్థులకో రెండు మూడు పంచకావ్య అధ్యాయాలు నూరిపోసినంత మాత్రాన రాత్రికి రాత్రే ఎవరూ కాళిదాసులు,

భవభూతులుగా మారిపోలేరు. తెలుగు పుస్తకాలంటూ ప్రచురించి చదువరుల మీదకు వదిలే ఏ కొన్ని రచనలు తిరగేసినా చాలు.. తెలుగు రచయితలకు అసలు స్వతంత్రంగా రాయడం, స్వతంత్రించి రాయడమంటూ రానే రాదేమో అన్న శంక కలగక మానదు. ఏ జాతికి ఆ జాతి తనదైన ఒక సొంత ముద్ర కలిగి ఉంటేనే ప్రపంచం ముందు సగర్వంగా తలెత్తుకు నిలబడేది. సాంస్కృతిక విశిష్టతకు అద్దం పట్టే జాతీయాలు, పలుకుబడులు, జానపద సాహిత్యం వంటి మణి మాణిక్యాలను తోసిరాజనుకొని నిత్యజీవితానికి బొత్తిగా అక్కరపడని ఎక్కడివో, ఎప్పటివో, ఎవరు ఏ సందర్భానికి వాడినవో కూడా ఇతమిత్థంగా అంతుబట్టని గులకరాళ్లతో వింత శబ్దాలకు ఒడిగట్టడం వినేందుకు ఎబ్బెట్టుగా ఉంటుంది. ముందు తరాల మేధోశక్తిని బండబార్చే ఆ తరహా వెకిలి అనుకరణలు మనకు వద్దు'.. ఆపుడప్పుడుగా తాతాజీ తెలుగుదనంలేమి, తెలుగువారి భావలేమిని గురించి వాపోతూ చేసిన ఎన్నో వ్యాఖ్యల్లో ఇవి కొన్ని చురకలు మాత్రమే!

జనవాణి దినపత్రిక, కాగడా వారపత్రికల కోసం తాతాజీ రాసిన దారావాహిక గల్పికల నిండుగా ఈ తరహా ఆలోచనలు మరెన్నో మిరిమిట్లు గొల్పుతుంటాయి.

టాల్ స్టాయ్ 'అన్నా కెరీనా'ను అత్యద్భుతంగా తెనుగు చేసిన చేవ పుష్కలంగా గల ధర్మారావుగ ‘భాషాంతరీకరణ బద్ధకం’ మీద చేసిన వ్యాఖ్యలను సదుద్దేశంతో అర్థం చేసుకొన్నప్పుడే తెలుగు మెరుగుపడుతుంది. తెలుగుజాతిని తమదైన తెలుగు సంస్కృతీ సాహిత్యాల ప్రాభవం నుంచీ దూరంగా నెట్టివేసే హక్కు ఏ ఒక్క రచయితకూ, ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వానికీ లేదు. అకాడమీలకయితే అసలుకే లేదన్నది తాతాజీ ధృఢాభిప్రాయం.

వందల కొద్దీ చేసిన రేడియో ప్రసంగాలు, మూడు పదులకు పై చిలుకు చలనచిత్రాలకు చేసిన కథలు.. మాటలు.. పాటలు.. రెండు దశాబ్దాల పాటు అలుపెరుగకుండా సాగించిన ధర్మారావు ధర్మపోరాటాలు సాహిత్యోద్యమాల్లో అప్పట్లో ఒక రికార్డు!

ఎంత ‘మిషనరీ మత సమర్థకుల పద్ధతులు’ అంటూ కరడు గట్టిన గ్రాంధికవాదులు శ్రీ పిఠాపురం మహారాజావారంతటి పెద్దలు ఎద్దేవాలకు పూనుకున్నా వారి స్వంత దినపత్రిక సైతం వ్యావహారిక భాష దారి పట్టినప్పటి నుంచే ఒక దారిలో పడిందన్న వాస్తవం గుర్తించాలి. వీరగ్రాంధికభాషావాది మహారాజావారు నడిపించిన పత్రికకు వీరవ్యవహారికభాషావాది తాపీ ధర్మారావు సంపాదకీయం నెరపడం తెలుగు పత్రికారంగంలో ఒక అరుదైన దృశ్యం! విశ్వవిద్యాలయాల ధోరణిలో మార్పు, ప్రచురణ కర్తలలో రేకెత్తిన పునరాలోచనలు, పత్రికాధిపతుల విధానాల్లో కొట్టొచ్చినట్లు కనిపించిన తూగు తాపీవారి అలుపెరుగని వ్యవహారిక భాషాయుద్ధాలు సాధించిన గొప్ప విజయాలు.

మాలపిల్ల, రైతుబిడ్డ వంటి సామాజిక విప్లవ చిత్రాలకు సంభాషణలు అందించారు తాతాజీ. నవరసాలు ఒలికే సన్నివేశాలు ఎన్నింటినో వెండితెర మీద ఆయన కలం పండించింది. 'ఏ ఒక్క సందర్భంలోనూ 'జనం మాట్లాడే తెలుగు' చాలింది కాదు అనిపించలేదు...' అంటారాయన.

బిరుదరాజు రామరాజు వంటి అవిశ్రాంత జనసాహితీ పరిశోధకునితో తెలీని పోత్తేదో పెట్టుకొని మరీ ఒకే ఏడాదిలో(1887) పుట్టినట్లు.. గిట్టినప్పుడూ ఇంకేదో ఒప్పందం పత్రం మీద గుట్టుగా సంతకాలు గిలికినట్లు ప్రముఖ హేతువాది, రచయిత డాక్టర్ జి.వి. కృష్ణరావు పరమపదించిన 1973లోనే తాపీ ధర్మారావుగారు జీవన పోరాట రంగం నుంచి నిష్క్రమించారు. అదో వింత!

తాతాజీ జీవితమంతా ఇట్లాంటి ఎన్నో వింతలు విశేషాలతో నిండిన పుస్తక సంపుటి అనుకుంటే ఇది వారి ఆఖరి సంకలనం తాలూకు చిట్టచివరి అధ్యాయం చివరి చమత్కారం అనుకొంటే తృప్తిగా ఉంటుంది.

గురజాడవారి కన్యాశుల్కం, ముత్యాలసరాల కాలం దాటి ఇప్పటికి వందేళ్లు గడచినా తెలుగు భాషామతల్లి ఎన్నో సమస్యలతో ఇంకా తల్లడిల్లుతూనే ఉంది. నన్నయ.. చిన్నయ గ్రాంధికాల, గసడదవాదేశాల గండాలు గడచిపోతేనేమి.. అంతకు మించి మెకాలే మహానుభావుని మానసపుత్రుల ఆంగ్లం మన తెలుగుతల్లి మెడ వీద గండకత్తెరగా వేలాదుతోంది. దొరల భాష పైన అవసరానికి మించి పెద్దల తగని వ్యామోహం పసిబిడ్డలకూ వారి బంగారు భవిష్యత్తుకూ మధ్య పెద్ద అడ్డంకిగా మారింది. ఆంగ్లభాషాజ్ఞానలేమి ఓ మానసిక లోపంగా కుంగిపోయే మన తెలుగు మాలోకాలను మళ్ళీ నేల పైకి చేది రెండు కాళ్లపై నిలబట్టే పోరాత దిట్టల చేయూత అవసరం తక్షణం, వ్యావహారిక భాష కోసం ఆనాడు అహరహం తపించిన తాతాజీవంటివారి జీవితాలు అచ్చమైన తెలుగు కోసం మొదలయిన నేటి కొత్త పోరుకు స్ఫూర్తిదాయకంగా మారితే అదే తాపీవారి ఆశయానికి తెలుగుజాతి సమర్పించే నిజమైన నివాళి!

----------------------------

ధర్మారావుగారి పూర్వీకుల ఇంటి పేరు బండి.. బందారు లో ఏదో ఒకటై ఉండవచ్చునని కొంతమంది పరిశోధకులు ఇతమిత్థంగా తేల్చని ఒక అభిప్రాయం. ధర్మారావుగారి తల్లి పేరు నరసమ్మ. తండ్రి పేరు అప్పన్న. అప్పన్న తాతగారు లక్ష్మయ్య తాపీ పనిలో మంచి పేరు తెచ్చుకోవడంతో అతనికి శ్రీకాకుళంలో "తాపీ లక్ష్మయ్యగారు" అన్న పేరు స్థిరపడిపోయిందంటారు. (సోర్స్: వికీపీడియా)

COMMENTS